

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**త్రివిక్రం** సుందరేశ్వర్‌కి ఆ వివరాలన్నీ రాత్రి భోజనం దగ్గర చెప్పాడు.

మనసులో లెక్క కట్టి సుందరేశ్వర్ చెప్పాడు.

"అంటే పై గురువారం టెన్త్‌డే అవుతుంది. ఆ రోజు సాయంత్రం మళ్ళీ వాళ్ళదగ్గరికి వెళ్ళి మహిమ భర్త ఏం తెచ్చాడో చూడండి."

"గురువారం అయిందా? సరే."

"ఈలోగా నవనీత్ గురించి వాకబు చేస్తే బావుంటుందేమో?"

"నేనూ అదే అనుకున్నాను. కానీ అతని గురించి ఎవర్ని అడగాలో, ఎక్కడ మొదలుపెట్టాలో నాకు అంతుపట్టడంలేదు. అలెగ్జాండర్, కురంగేశ్వర్‌లకి అతని గురించి తెలీదు. హరినాథ్‌కి తెలుసేమో కానీ ఆయన లేరు."

త్రివిక్రం రకరకాలుగా ఆలోచిస్తూ చాలాసేపు డైనింగ్ టేబుల్ ముందే కూర్చున్నాడు. తర్వాత లేచి చేతిని కడుక్కుని వెళ్ళి కంప్యూటర్ ఆన్ చేసాడు. ముందు బి.ఎస్.ఎన్.ఎల్ వెబ్ సైట్లోకి వెళ్ళి హైదరాబాద్‌లో నవనీత్ పేరు మీద గల ఫోన్ నెంబర్లని తన కంప్యూటర్‌లోని ఓ నోట్ పేడ్‌లో కాపీ చేసాడు. తర్వాత హైద్రాబాద్ మునిసిపల్ కార్పోరేషన్‌లాంటి వివిధ ప్రభుత్వ వెబ్‌సైట్లలో నవనీత్ పేరు కోసం వెతికాడు. ఆ పేరుగల వారి వివరాలన్నీ కూడా కాపీ చేసుకున్నాడు. కొంత ఫోన్ మీద, కొంత స్వయంగా వెళ్ళి ఎంక్వయిరీ చేయాల్సిన అవసరం ఉందని త్రివిక్రం తన దగ్గర ఉన్న సమాచారాన్ని బట్టి గ్రహించాడు.

వెంటనే శ్యామలరావు గుర్తుకు వచ్చాడు. అతనికి ఫోన్ చేసి చెప్పాడు.

"మరోసారి మీ సహాయం అవసరం అయింది."

"అలాగే సార్. ఈసారి ఏ ఊరికి వెళ్ళాలి?" అవతల నించి అడిగాడు.

"ప్రస్తుతానికి బాలానగర్‌లోని హెచ్.ఎమ్.టి ఫేక్టరీ ప్రాంతంలోని ఏన్సిలరి ఇండస్ట్రీస్‌ని ఇరవై ఏళ్ళ క్రితం నడిపిన గోవర్ధన్ కొడుకు నవనీత్ గురించి ఎంక్వయిరి చేయాలి. ఆయన ప్రస్తుత చిరునామా కావాలి." చెప్పాడు త్రివిక్రం.

శ్యామలరావుకి ఆ వివరాలు చెప్తే అతను రాసుకున్నాడు.

"మీకు తీరిక సమయంలో చూడండి."

"నో ప్రాబ్లమ్ సార్. నేను ఎటూ రేపు అక్కడికి వెళ్ళాల్సిన పనుంది. నా క్లైంట్స్ హైద్రాబాద్‌లో చాలా చోట్ల ఉన్నారు." చెప్పాడు.

శ్యామలరావు తన బైక్‌ని బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని హెచ్.ఎమ్.టి ఏన్సిలరి ఇండస్ట్రీలు ఉన్న ప్రాంతంలోకి పోనించాడు. ఒక్కో ఇండస్ట్రీ ముందు ఆపి ఎంక్వయిరీ చేయసాగాడు. 1980లో గోవర్ధన్ అనే అతను అక్కడ నడిపిన ఏన్సిలరి ఇండస్ట్రీ ఏది? దాని పేరు తెలుసా? అతనికి అప్పుడు నవనీత్ అనే కాలేజీలో చదివే కొడుకు ఉండేవాడు.

అవన్నీ ఇంజనీరింగ్ ఇండస్ట్రీలో స్ప్రింగ్‌లు, షీట్స్, డైలు బోల్టులు, నట్లు, డిస్క్‌లులాంటివి తయారుచేసే చిన్న చిన్న కార్ఖానాలు. దాదాపు పాతిక ఇండస్ట్రీస్‌లో అడిగినా ఎవరూ సరైన సమాచారం చెప్పలేకపోయారు. వారంతా గత పదిహేను ఏళ్ళలోపే ఆ ఇండస్ట్రీని నడుపుతున్నారు. కొందరికైతే ఇప్పుడు తమతోపాటు ఎవరెవరు అక్కడ ఏన్సిలరి ఇండస్ట్రీస్ నడుపుతున్నారో కూడా తెలీదు. తమ వర్క్, తమ వ్యాపారం తప్ప ఇతరుల గురించి పట్టించుకోని వారు చాలామంది ఉన్నారు. అందరినీ ఎంక్వయిరీ చేయడానికి గంటపట్టింది. అయినా అంతగా ఉపయోగించే సమాచారం ఎవరూ చెప్పలేకపోయారు.

ఒక్కరు మాత్రం గోవర్ధన్ అనే అతను గాయత్రి ఇండస్ట్రీని నడిపేవాడని నమ్మకంగా చెప్పాడు. దాని అడ్రస్ చెప్పాడు. శ్యామలరావు అంతకుముందు చేసిన ఆ చిరునామాకి మళ్ళీ వెళ్ళాడు. పదిహేనేళ్ళ క్రితం తన తండ్రి గాయత్రి ఇండస్ట్రీస్‌ని కొన్నాడని, దాని ప్రొప్రైటర్ పేరు గోవర్ధన్ అవునో కాదో తెలీదని దాన్ని నడిపే అతను చెప్పాడు. కొన్నాక అతని తండ్రి దాని పేరుని చైతన్య ఇండస్ట్రీస్‌గా మార్చాడు. అతనితో మరి కొద్దిసేపు మాట్లాడాక శ్యామలరావు తన ఇంటికి వెళ్ళిపోయాడు.

శ్యామలరావు మర్నాడు ఉదయం త్రివిక్రంకి ఫోన్ చేసి చెప్పాడు.

"గోవర్ధన్ తన ఇండస్ట్రీని అమ్మేసాడు. దాన్ని కొన్న అతన్ని ఆయన అడ్రస్ చెప్పమన్నాను సార్. సేల్ డీడ్‌లో అడ్రసులు రాసుకుంటారు. ఈ ఆదివారం అతనింటికి వెళ్ళి అది చూస్తాను."

"సరే."

"అతను ఆ సమాచారం చెప్పకపోయినా రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళ్ళి ఆ డాక్యుమెంట్ కాపీ కోసం ప్రయత్నిస్తాను. అది ఖచ్చితంగా రిజిస్టర్డ్ సేల్ డీడ్ అయి ఉంటుంది" చెప్పాడు శ్యామలరావు.

"అలాగే. సాధారణంగా లంచం ముట్టకుండా అలాంటి ఆఫీసుల్లో పని చేయరు కాబట్టి రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్ళాల్సి వస్తే నన్ను కలిసి కొంత డబ్బు తీసుకోండి" త్రివిక్రం సూచించాడు.

"అలాగే సార్. ఇవన్నీ నాకు కొట్టిన పిండే. మా దగ్గర చీటీ పాడి ఒక్కోసారి మనిషి అడ్రస్ మార్చేస్తుంటాడు. అలాంటి వారిని వెతికి పట్టుకోవడంలో నాకు కొంత అనుభవం ఉంది." నవ్వుతూ చెప్పాడు శ్యామలరావు.

త్రివిక్రం కూడా తను కాపీ చేసుకున్న నవనీత్ పేర్లు గల వారి ఫోన్ నెంబర్లకి వీలున్నప్పుడల్లా ఫోన్ చేసి 'అది గోవర్ధన్ కొడుకు నవనీత్ ఫోన్ నంబరేనా?' అని అడగసాగాడు. నవనీత్ పేరున్న వారిలో ఎక్కువ మంది గుజరాతీలు, బెంగాలీలు, నార్త్ ఇండియన్ రాష్ట్రాలకి చెందినవారై ఉండడం గుర్తించాడు. తెలుగు వారు తక్కువ. ఒకవేళ గోవర్ధన్ హైదరాబాద్‌కి వలస వచ్చిన నార్త్ ఇండియనా అన్నది అతని తెలియలేదు.

శ్యామలరావు కనుక్కోలేకపోతే ఇక నవనీత్‌ని కనుక్కోవడం ఎలా? అతనికి అందుకు ఒక్క మార్గం, ఒక్క క్లూ కూడా ఎంత ఆలోచించినా తట్టలేదు.

ఆ రోజు ఛాటింగ్‌లో స్ఫూర్తి మళ్ళీ త్రివిక్రంకి కలిసింది.

"నేనో విషయం సూటిగా చెప్పొచ్చా?" అడిగాడు.

"చెప్పండి."

"మా నాన్నగారు అల్జీమర్స్ వ్యాధితో బాధ పడుతున్నారు అని ఇదివరకు చెప్పాగా? అంటే గతం కాని, మనుషులు కానీ గుర్తుండరు. గూగుల్ చేసి దాని గురించి తెలుసుకోండి. నా తల్లి పోయింది. సుందరేశ్వర్ అనే లివిన్ హెల్ప్ ప్రస్తుతం మాతో ఉన్నారు. కాబట్టి మా నాన్నగారిని చూసుకోవడానికి ఓ కోడలు, కుటుంబం కోసం నాకో భార్య కావాలి. నేనింతదాకా ఆ విషయం గురించి సీరియస్‌గా ప్రయత్నం చేయలేదు. ఈ రోజుల్లో మారేజ్ డాట్ కాంలలో రిజిస్టర్ చేసుకోవడమేగా ప్రయత్నం అంటే."

"అవును."

"ఎందుకో, ఎలాగో ఆన్‌లైన్‌లో మీతో పరిచయం అయింది. మనం ఓసారి కలిసి మాట్లాడుకుందాం. ఒకరికొకరు అన్నీ నచ్చితే మనం పెళ్ళి చేసుకోవడానికి మీకు ఏదైనా అడ్డమా? ఇది నాకు మీరు చెప్పాలి. అది ఓకే ఐతే ఓసారి కలుద్దాం. మీరు మంచి అమ్మాయి అనే భావన నాకు కలిగింది కాబట్టి సూటిగా అడుగుతున్నాను. మీ నాన్నగారితో చెప్పి వారు సరేనంటే ఈ ఆదివారం కలుద్దాం. వారు వద్దంటే కలవొద్దు. నో ప్రాబ్లం. ఇంటర్ నెట్ ద్వారా టైం పాస్‌కి సరదాగా మీతో కాలక్షేపం చేయడం నా ఉద్దేశం కాదు."

దానికి కొన్ని క్షణాల తర్వాత జవాబు వచ్చింది.

"మీది 'ఐ లవ్ యు కేసా? ప్రపోజల్ కేసా?"

"రెంటి మిక్చర్. రెండోదే అనుకున్నా నాకు అభ్యంతరం లేదు."

"మన మధ్య ఏజ్ గేప్ తొమ్మిదేళ్ళు. కాబట్టి నేను ఆలోచించుకోవాలి శనివారం ఏ సంగతీ మీకు మెయిల్ ఇస్తాను. ఓకే?"

"ఓ.కే. ఈ రోజుల్లో ఎయిటీ ఎయిట్ బార్న్ పిల్లలు ఎయిటీ సిక్స్ బార్న్ మగపిల్లలనే అంటే ఒకటి, రెండేళ్ళ ఏజ్ గేప్ ఉన్న వారినే ప్రిఫర్ చేస్తున్నారు. అందువల్ల జనరేషన్ గేప్ వల్ల కలిగే పేచీలు ఉండవని అంటున్నారు. ఇది మనిద్దరి మధ్యగల ప్రధాన సమస్య. కానీ మా అమ్మకి, నాన్నకి తొమ్మిదేళ్ళు తేడా. పూర్వం రెండేళ్ళ తేడా పెద్ద డిస్క్వాలిఫికేషన్ అయ్యేది. దేని ప్రయోజనం దానికి ఉంది. నేను శనివారం మీ మెయిల్ చదివాక నా భవిష్యత్ ఎటో ఆలోచిస్తాను" జవాబు ఇచ్చాడు.

ఆమె గురించి త్రివిక్రం సుందరేశ్వర్‌కి అంతదాకా చెప్పలేదు.

గురువారం ఉదయం త్రివిక్రం బాత్‌రూంలో స్నానం చేస్తూండగా అతని సెల్‌ఫోన్ మోగింది. అది డైనింగ్ టేబుల్ మీద ఉండటంతో సుందరేశన్ ఆన్సర్ చేసాడు.

త్రివిక్రం బ్రేక్‌ఫాస్ట్ కోసం అక్కడికి రాగానే చెప్పాడు.

"మహిమ నించి మీకు ఫోన్ వచ్చింది. మీరు స్నానం చేస్తున్నారని, రాగానే ఫోన్ చేయిస్తానని చెప్పాను. మహిమ అంటే హరినాథ్ కూతురే కదా?"

"అవును. ఇవాళ గురువారం కాబట్టి నేనే చేద్దామనుకున్నాను.

వెంటనే త్రివిక్రం మహిమకి ఫోన్ చేసాడు.

"హలో. డాక్టర్ త్రివిక్రంని. మీరు ఫోన్ చేసారట కదా. మీ వారు వచ్చారా?"

"నిన్న తెల్లవారు ఝామున వచ్చారు. మీరు కోరింది తెచ్చారు."

"వండ్రఫుల్. థాంక్స్. నేను ఎప్పుడు కలెక్ట్ చేసుకోవచ్చు? "

"ఎనీ టైం."

"ఆల్ రైట్. ఇంకో అరగంటలో మీ దగ్గర ఉంటాను. ట్రాఫిక్ ఇబ్బంది ఉంటే గంటలో ఉంటాను."

"ఓ.కే. మీరు ఈ మూడురోజులు మా ఇంటికి భోజనానికి రావాలి. వచ్చాక కార్డ్ ఇస్తాను."

సుందరేశన్ బ్రేక్ ఫాస్ట్ చేయమన్నా టైం లేదని తినకుండానే త్రివిక్రం సరాసరి హరినాథ్ ఇంటికి వెళ్ళాడు. ఇంట్లోంచి వేదపండితులు పఠించే వేదం పన్నాలు వినిపిస్తున్నాయి. నిక్షేప్ కనబడ్డాడు. గతంలో అతను చూపించిన వ్యతిరేక ధోరణి పూర్తిగా మాయమైంది. ఆప్యాయంగా కరచాలనం చేసాడు.

"కూర్చోండి. మహిని పిలుస్తాను."

మహిమ తన భర్తతో వచ్చింది. అతను తెలుగువాడు కాదు. తెల్లజాతి మనిషి.

పరిచయాలయ్యాక రాబర్ట్ చెప్పాడు.

"హరినాథ్ షేవ్ చేసుకున్న రేజర్ని, ఆయన వాడిన టూత్ బ్రష్ని, ఆయన బాత్ రూంలోంచి తెచ్చాను. రేజర్లో వెంట్రుకలు ఉన్నాయి. అనుమానం లేకుండా అవి ఆయనవే. టూత్ బ్రష్లో ఎండిన లాలాజలం ఉంటుంది కాబట్టి దాన్నీ ఉపయోగించుకోవచ్చు."

"వండ్రఫుల్. అవి చాలు డి.ఎన్.ఏ పరీక్షకి." ఆనందంగా చెప్పాడు త్రివిక్రం.

"మహిమ నాకు మొత్తం జరిగింది చెప్పింది. 'జీవితం కాల్పనిక సాహిత్యంకన్నా చిత్రమైనది' అని వింటూంటాం. అది నిజమని మీ కథ విన్నాక తెలిసింది."

రాబర్ట్ ఆ వస్తువులు వేసి తెచ్చిన జిప్లాక్ బాగ్ని త్రివిక్రంకి ఇచ్చాడు. మహిమ కోరినట్లుగా త్రివిక్రం అక్కడే బ్రేక్ఫాస్ట్ తీసుకుని సరాసరి గాంధీ హాస్పిటల్కి చేరుకున్నాడు. నేరుగా లేబ్ టెక్నీషియన్ దగ్గరకి వెళ్ళి జిప్ లాక్ బాగ్ని ఇచ్చి మరోసారి డి.ఎన్.ఏ టెస్టుని చేసి తన డి.ఎన్.ఏతో అది మేచ్ చేయమని కోరాడు.

"రక్తంతో అయితే నేను చేయగలను కానీ వీటి డి.ఎన్.ఏ పరీక్షని నేను చేయలేను. మన హైదరాబాద్లోనే సి.సి.యం.బిలో దీన్ని చేస్తారు."

"అవును. ఇండియాలోని క్రిమినల్ కేసుల్లో డి.ఎన్.ఏ రిపోర్టుకి ఇక్కడికే పంపిస్తారు. అక్కడ నాకు తెలిసిన డాక్టర్ ఉన్నారు."

"ఇంకేం? పని త్వరగా అవుతుంది" చెప్పాడు టెక్నీషియన్.

"థాంక్స్."

ముందుగా ఫోన్ చేసి త్రివిక్రం సెంటర్ ఫర్ సెల్యులర్ మాలిక్యులర్ అండ్ బయోలాజికల్ ఇన్స్టిట్యూట్కి వెళ్ళి, తనతో యం.బి.బియస్ చదివిన సీనియర్ డాక్టర్ జగ్గయ్యని కలిసాడు. త్రివిక్రం అతని గదిలోకి వెళ్ళగానే జగ్గయ్య అతన్ని చూసి గుర్తుపట్టాడు. లేచి ఆనందంగా అడిగాడు.

"హలో విక్కీ! ఏమిటీ ఆకస్మిక రాక? ఎలా ఉన్నావు?"

"నీతో చిన్నపనిపడి వచ్చాను బ్రదర్." చెప్పాడు త్రివిక్రం.

నెల్లూరుకి చెందిన జగ్గయ్య ఎన్.టి.రామారావు ఫేన్. అప్పట్లో బ్లేడ్స్తో అక్కినేని నాగేశ్వరరావు అభిమానులని ఎదుర్కొన్న వారిలో జగ్గయ్య ఒకడు.

టూత్ బ్రష్, షేవింగ్ స్టిక్ ఉన్న జిప్ బ్యాగ్ని టేబుల్ మీద ఉంచి తను వచ్చిన పని చెప్పాడు. త్రివిక్రం తన తండ్రి కోసం వెదుకుతున్నాడన్న విషయాన్ని కానీ, తన తల్లి నలుగురిచేత బలాత్కరింపబడిందన్న విషయాన్ని గానీ సిగ్గుపడి ఎక్కడా దాచకుండా

చెప్పాడు. అది అవసరమైన వారికి ఫ్రాంక్‌గా తన తండ్రిని కనుక్కునే క్రమంలో అవసరమైన సందర్భంలో చెప్తూనే ఉన్నాడు. త్రివిక్రం చెప్పింది ఆశ్చర్యంగా విన్న జగ్గయ్య చెప్పాడు.

"ఎంత విచిత్రంగా ఉంది నువ్వు చెప్పింది?"

"అవును. విన్నవాళ్ళంతా అదే అంటున్నారు."

అతను తల పంకించి చెప్పాడు.

"నిన్న రాత్రే ఇంటర్నెట్‌లో దేనికోసమో వెతుకుతూ ఓ ఆర్టికల్‌ని చదివాను. ఓ స్వీడిష్ రచయిత్రి రాసిన ఓ విషయాన్ని ఇంగ్లీషులోకి ఎవరో అనువదించి పోస్ట్ చేసారు. ఆమె తండ్రి సైనోలియల్ సర్కోమ్‌తో మరణించాక రాసిన వ్యాసం అది. తెలుసుగా సైనోలియల్ సర్కోమ్?"

"తెలుసు. సాఫ్ట్ టిష్యూ కేన్సర్ ఇన్ ది లంగ్."

"తమ కుటుంబ ఫోటో ఆల్బంలో ఒక్క ఫోటోలో కూడా తమ తండ్రిలేడు. కారణం తమ కుటుంబ సభ్యులందరినీ కలిపి ఎప్పుడూ తన తండ్రే ఫోటోలని తీసాడట. పేరిస్‌లోని ఈఫిల్ టవర్, పీసాలోని లీనింగ్ పీసా టవర్, ఏథెన్స్‌లోని ఆక్రోపాలిస్ దేవాలయం మొదలైన చోట్ల కేవలం తామే ఉన్నామని, ఆయన ఫోటోలు మాతో కలిసి లేవనే సంగతి ఆలస్యంగా గుర్తించానని ఆమె ఆవేదనని వ్యక్తం చేస్తూ ఎంతో టచింగ్‌గా ఆ వ్యాసాన్ని ఆమె రాసింది. ఒక్క ఫోటోల్లోనే తండ్రి ఫోటో మిస్సయి ఆమె అంత బాధపడితే, ఇక ఏకంగా నీ జీవితంలోంచే ఆయన మిస్ అయితే ఇంక నువ్వు ఎంత బాధపడుతున్నావో నేను అర్థం చేసుకోగలను." జగ్గయ్య సానుభూతిగా చెప్పాడు.

"ఎర్మా బొంబోడెక్ అనే అమెరికన్ హాస్య రచయిత్రి పాపులర్ కొటేషన్ ఒకటి ఇదే అంశం మీదది గుర్తుకు వస్తోంది. 'ఫాదర్ ఈజ్ ది ఒన్ హు టేక్స్ లాట్స్ ఆఫ్ పిక్చర్స్, బట్ నాట్ ఇన్ ఈవెన్ ఏ సింగిల్ వన్ ఆఫ్ దెమ్' అంటుంది ఆమె. ఒకే విషయం మీద ఇద్దరు రచయిత్రులు ఒకే భావంతో స్పందించారనే చెప్పాలి."

"ఐ థింక్ యూ ఆర్ రైట్. భావజాలం విషయంలో ఏ ఫార్ములా, ఏ లెక్కా, ఏ నియమం మనుషుల మీద పనిచేయదు. ఫలానా దానిని అంతా బాధగా లేదా ఫలానా దానిని అంతా ఆనందంగానే స్పందిస్తారు అని సాధారణంగా అనుకుంటాం కానీ అందరి విషయంలో అలా జరగకపోవచ్చు."

"నో సన్ ఈజ్ ఎంటైర్లీ రెస్పాన్సిబుల్ ఫర్ హి ఫాదర్. దటీజ్ హిజ్ మదర్స్ రెస్పాన్సిబులిటీ. ఆర్ పర్‌హేప్స్ ఇరెస్పాన్సిబిలిటి కొందరి విషయంలో" నవ్వాడు త్రివిక్రం.

"తండ్రిని మిస్ అయ్యాననే బాధ అయితే ఉంది కానీ, ఆ స్వీడిష్ రచయిత్రికి కలిగినంత బాధ నాలో లేకపోవచ్చు. ఇప్పటికే నేను నన్ను ప్రేమించిన, పెంచిన తండ్రినే మా నాన్నగా భావిస్తున్నాను. నా బయోలాజికల్ తండ్రిని చూడాలనే పెద్ద సైజు ఆసక్తే నన్ను ఆయన్ని వెదికి తెలుసుకునే పనికి పురికొల్పింది అనుకుంటా. ప్రేమవల్ల అని నేను అనుకోను. నా తండ్రి నన్ను పెంచిన నాన్నే అని నా భావన." త్రివిక్రం నిజాయితీగా చెప్పాడు.

"మా ఆవిడ మా పెళ్ళయ్యాక తన వెంట కొన్ని కొటేషన్ పుస్తకాలని వెంట తీసుకువచ్చింది. అవన్నీ బంధుమిత్రులు వివిధ సందర్భాల్లో బహూకరించినవి. వాటిల్లో ఒకటి ఇంట్లోని మా డైనింగ్ టేబుల్ మీద ఉంచింది. 'బ్లెస్డ్ ఇండీడ్ ఈజ్ ది మేన్ హు హియర్స్ మెనీ వాయిసెస్ కాల్ హిమ్ ఫాదర్."

ఆ తర్వాత వారి సంభాషణ తమ మెడికల్ కాలేజీ రోజుల్లోకి వెళ్ళింది. తమ కాలేజీ బ్యూటీ ప్రేజా రెడ్డి గురించి, ఆమె ఎక్కి వచ్చే స్కూటర్ గురించి, తాము కండక్ట్ చేసిన మెడికల్ సైన్సు ఎగ్జిబిషన్ గురించి, కేరళ ఎక్స్కర్షన్‌కి వెళ్ళిన సంగతులూ మొదలైనవి ఎంతో ఉత్సాహంగా గుర్తుచేసుకున్నారు.

"మన ఫిజియాలజీ ప్రొఫెసర్ గుర్తున్నాడా?" అడిగాడు జగ్గయ్య.

"బ్లైండ్ గారూ అనేవాళ్ళం. ఆయనేనా?"

"అవును. ఆయన క్రిస్టియన్. పేరు లిండ్ ఆయన ఇంటిపేరు బి. అందుకని 'బి.ఎల్.ఐ.డి' అని ఆయన డిపార్ట్‌మెంట్ తలుపు మీద రాసి ఉండేది. బి పక్కన చుక్కని కొట్టేసి అంతా ఆయన్ని బ్లైండ్‌గారూ అనేవాళ్ళం."

"అవును"

"ఆయన కూతురు కేథలీన్ గుర్తుందా?"

"ఎందుకు గుర్తులేదు? మొహం తప్ప మిగతా అంతా అందంగా ఉండేది. ఇంటర్ కాలేజీ షటిల్స్‌లో ఎప్పుడూ ఫస్ట్ వచ్చేది."

"ఎగ్జాట్లీ. ఆమె ఇప్పుడు ఎక్కడుందో తెలుసా?"

"జైల్లోనా?"

"వాషింగ్‌టన్ డిసిలో. ఒబామా భార్య మిషెల్‌కి కేథలీన్ పర్సనల్ ఫిజీషియన్‌ట. తరళ గుర్తుందా?"

"కోటినాగులు కదా ఆ అమ్మాయిపేరు?"

"ఎగ్జాట్లీ. కోటి నాగులు ఎం.బి.బి.ఎస్‌లో సీట్ వచ్చాక తన పేరుని తరళగా మార్చుకుంది. ఫస్టియర్ ఆ బాబ్డ్ హెయిర్ ఎలా వచ్చిందో తెలుసా? నిజానికి పెద్ద జడ. సీట్ వచ్చిందని తిరుమలకి వెళ్ళి బోడిగుండు చేయించుకుని వచ్చింది" నవ్వుతూ చెప్పాడు జగ్గయ్య.

"అవునవును."

"ఆ తరళ ఆ మధ్య ఎక్కడో కలసి చెప్పింది. ఇప్పుడామె రెడ్డీ లేబ్స్‌లో పెద్ద పోస్ట్‌లో ఉంది. తరళని కేథలీన్ అమెరికాకి అనేకసార్లు రమ్మని పిలిచిందిట. అదేం ఖర్మో ఎన్నిసార్లు కన్‌సులేట్‌కి వెళ్ళినా తరళకి అమెరికన్ వీసా రాలేదుట. చెన్నైలో అయితే ఇవ్వరని కలకత్తాలో బేంక్ అకౌంట్ ఓపెన్ చేసి రెండేళ్ళ తర్వాత, తను అక్కడికి షిఫ్ట్ అయ్యానని కలకత్తా అమెరికన్ కన్సలేట్ కూడా వీసా కోసం వెళితే, గతంలో తనని చెన్నైలో ఇంటర్వ్యూ చేసిన ఓ కన్సలేట్ ఆఫీసర్ అక్కడ కనపడిందంట. ఎలా ఉన్నావని పలకరించి వీసాని రిజెక్ట్ చేసి పంపించిందంట మిసెస్ కోలిన్. తరళకి భారతదేశంలోని అమెరికన్ కన్సలేట్ ఆఫీసర్ల పేర్లన్నీ తెలుసు. ఏ తలకి మాసినవాడైనా తనకి వీసా మంజూరు చేయకపోతాడా అని ఇండియాలోని అన్ని అమెరికన్ కన్సులేట్లకి ఇప్పటికి పద్దెనిమిదిసార్లు వెళ్ళిందిట. కానీ ప్రయోజనం లేకపోయిందని చెప్పింది. ఇది తెలిసి వీసాని మంజూరు చేయమని మిషెల్ సెక్రటరీద్వారా ఎంబసీకి ఉత్తరం పంపి కేథలీన్ వీసా తెప్పించిందంట."

మిత్రులతో పాత విషయాలని మాట్లాడే ఆనందాన్ని జగ్గయ్య కొద్దిసేపు అనుభవించాక లేబ్ ఇన్‌చార్జ్‌ని పిలిపించి త్రివిక్రం తెచ్చిన వస్తువులని ఇచ్చి వాటి డి.ఎన్.ఏ రిపోర్ట్ కావాలని కోరాడు. త్రివిక్రం పేర బిల్లు చేయిస్తే ఆ మొత్తం త్రివిక్రం చెల్లించాడు.

"వారం పట్టొచ్చు సార్." చెప్పాడు అతను.

త్రివిక్రం తన పేరు, తన ఫోన్ నెంబరు రాసి ఉన్న ఓ కవరుని ఇచ్చి చెప్పాడు.

"దాన్లో నా డి.ఎన్.ఏ రిపోర్ట్ ఉంది. ఆ రెండూ మేచ్ అవుతాయో లేదో నాకు రిపోర్టు కావాలి. మీరు ఆ కవరు మీది నా నంబరుకి ఫోన్ చేస్తే వచ్చి తీసుకుంటాను. లేదా కొరియర్ చేయగలిగితే మరీ మంచిది."

"నేను కొరియర్ చేస్తాను" జగ్గయ్య చెప్పాడు.

జగ్గయ్య త్రివిక్రంని వచ్చే ఆదివారం తనింటికి భోజనానికి ఆహ్వానించాడు. ఇంటి చిరునామా, ఎలా రావాలో గుర్తులు రాసిచ్చాడు.

"శనివారం మళ్ళా ఫోన్ చేసి గుర్తు చేస్తాను. మా ఇంట్లో భోజనం చేయడానికి మా బంధువులు జంకుతారు కానీ నువ్వు ఇబ్బంది పడక్కరలేదు."

"ఏం? ఆవిడ వంట బాగా చేయదా?" నవ్వుతూ అడిగాడు త్రివిక్రం.

"ఫస్ట్ క్లాస్‌గా చేస్తుంది. డైనింగ్ టేబుల్ పక్కన గోడకి తన వెంట తెచ్చిన ఓ కొటేషన్‌ని వేలాడదీసింది. దానిమీద 'రెలెటివ్స్ ఆర్ దోజ్ హు కం టు ఈట్ అండ్ హూ ఆర్ నాట్ ఫ్రెండ్స్' అని రాసి ఉంటుంది."

అదే రోజు త్రివిక్రం ఓ గిఫ్ట్ షాపుకి వెళ్ళి ఓ కొటేషన్ రాయబడ్డ రోజ్ ఉడ్ వాల్ పేనల్‌ని జగ్గయ్య ఇంటికి భోజనానికి వెళుతూ తీసుకెళ్ళాలని కొని గిఫ్ట్ రాప్ చేయించాడు. దానిమీద ఇలా ఉంది. 'ఫ్రెండ్‌షిప్ అండ్ గుడ్ మేనర్స్ టేక్ యు టు డైనింగ్ ప్లేసెస్ వేర్ మనీ ఆర్ ఎడ్యుకేషన్ మే నాట్ టేక్ యు.'

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in